క్లుప్తంగా

విజిబుల్ పోలీసింగ్‌తో భరోసా



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్, కారు డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 21వ శతాబ్దంలో మానసిక సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం అనేది తప్పనిసరిగా ఒక సామాజిక బాధ్యతగా చూడాల్సిన అంశం అన్నారు. సైకాలజీ విభాగం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడారు. అధ్యాపకులు స్రవంతి రెడ్డి, శేషాద్రి నాయుడు, రామకృష్ణ, మాధవరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్, పాల్గొన్న అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 2వ వార్డులో రూ.35 లక్షలతో మురుగు కాల్వలు, 50వ వార్డు కొత్తపేటలో రూ.20 లక్షలతో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు, 12వ వార్డు డబరా కాలనీలో రూ.62.4 లక్షలతో మురుగు కాల్వలు, 24వ వార్డులో రూ.75 లక్షలతో మురుగు కాల్వలు, 23వ వార్డు శ్రీరామనగర్‌లో రూ.50 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన పనులు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ.. నగరంలో సమస్యలు గుర్తించి మూడు నెలల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. నగరంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. బాగుచేస్తే ఎంతో ఉపయోగం



దిగువపాడు శివాలయం వద్ద పనిచేయని చేతిపంపు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు శివాలయం, దర్గా ప్రాంతాల్లో రెండు చేతిపంపులు(బోరింగ్) మరమ్మతులకు గురయ్యాయి. కొన్నేళ్లుగా పనిచేయకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ చేతి పంపుల నీరే గ్రామస్తులకు ఆధారంగా ఉండేవి. పంచాయతీ కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా విద్యుత్ లేని సమయాల్లో, అత్యవసర పరిస్థితిల్లో చేతిపంపులు ఎంతో ఉపయోగపడేవని స్థానికులు చెబుతున్నారు. రానున్న వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మరమ్మతులకు గురైన చేతిపంపులను రిపేరు చేయించాలని కోరుతున్నారు.



దర్గా సమీపంలో మరమ్మతులకు గురైన చేతిపంపు

హాకీలో తడాఖా.. బ్యాడ్మింటన్‌లో అదుర్స్

- ఉత్తమంగా రాణిస్తున్న ఇద్దరు నగర క్రీడాకారులు
- చదువులో రాణిస్తూ.. క్రీడల్లో సత్తా చాటుతూ
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు కైవసం

కర్నూలు (టౌన్): తండ్రుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఇద్దరు క్రీడాకారులు వారు ఎంచుకున్న క్రీడల్లో సత్తా చాటుతున్నారు. వ్యక్తిగత క్రీడాంశంగా ఒకరు, జట్టు క్రీడలో మరొకరు రాణిస్తున్నారు. ఒకరు బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతుంటే.. మరొకరు జట్టులో ప్రత్యేకమైన గుర్తింపుతో హాకీలో అదరగొడుతున్నారు.

హాకీ అంటే కర్నూలు.. కర్నూలు అంటే హాకీ అనే పేరు నగరానికి ఉంది. ఇక్కడి నుంచి ఎంతో మంది క్రీడాకారులు హాకీలో ఉన్నత స్థాయిలో రాణించారు. వ్యక్తిగత ప్రతిభ చాటారు. తాజాగా ఇద్దరు క్రీడాకారులు స్కూల్ గేమ్స్ క్రీడల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం విశేషం. ఒకవైపు చదువుకుంటూ మరోవైపు అవకాశం వచ్చినప్పుడల్లా క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. వీరిరువురికి వారి తండ్రులే ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇరువురి తండ్రులు సైతం ఆయా క్రీడాంశాల్లో ప్రతిభ చాటిన వారే కావడం విశేషం.

హాకీలో అదరగొడుతున్న బొరెల్లి ధీరజ్ కుమార్

కర్నూలు నగరంలోని గిప్సన్ కాలనీకి చెందిన ధీరజ్ కుమార్ హాకీలో అదరగొడుతున్నాడు. పదవ తరగతి సిస్టర్ స్టానిస్లాస్‌లో చదువుకున్నాడు. ప్రస్తుతం నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇందిర జూపాడుబంగ్లా కేజీబీవీ స్కూల్ తెలుగు టీచర్ కాగా, తండ్రి ఎస్‌టీబీసీ కళాశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ధీరజ్ చిన్ననాటి నుంచే స్థానికంగా ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో తండ్రితో పాటు శిక్షణ తీసుకుంటున్నాడు. హాకీలో కోచ్‌లుగా వ్యవహరించిన వినోద్, రాజ్ కుమార్ వద్ద మెలకువలు నేర్చుకున్నాడు.



రాష్ట్రస్థాయి హాకీ విజేత ట్రోఫీతో క్రీడాకారుడు ధీరజ్

- 2019–20లో అనంతపురంలో నిర్వహించిన అండర్–14 టోర్నమెంట్‌లో మొదటిసారి వ్యక్తిగతంగా ప్రతిభ చాటాడు. అలాగే అదే సంవత్సరం ధర్మవరంలో నిర్వహించిన సబ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీల్లో కర్నూలు నుంచి ప్రాతినిధ్యం వహించాడు.
- గత ఏడాది నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టు తరఫున డిసెంబర్‌లో రాంచీ పట్టణంలో నిర్వహించిన జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ పోటీల్లో పాల్గొన్నాడు
- 2021–22లో కడప జిల్లా రాయచోటిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.
- 2022–23లో వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నారు. కాకినాడలో నిర్వహించిన శాప్ లీగ్ పోటీల్లో పాల్గొన్నాడు.
- 2023–24లో వైజాగ్‌లోని అనకాపల్లిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో అండర్–17 విభాగంలో రాణించారు.
- 2024 ఫిబ్రవరిలో కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ హాకీ పోటీల్లో 8 గోల్స్ చేసి రాష్ట్ర హాకీ జట్టుకు అలాగే అండర్–19 విభాగంలో వ్యక్తిగత ప్రతిభ చాటి రెండవసారి రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యాడు



అజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బ్యాడ్మింటన్ విజేత అజయ్‌కుమార్

కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన విజయ్‌కుమార్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. తండ్రి ప్రైవేటు ఉద్యోగి. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో రాణిస్తున్న అజయ్‌కుమార్ నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో పాలిటెక్నిక్ విద్య అభ్యసిస్తున్నాడు. 2012 నుంచి బ్యాడ్మింటన్ క్రీడపై మక్కువతో ప్రతి రోజు స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ క్రీడ సాధన చేశాడు. 2018లో అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులు శ్రీకాంత్, సింధూ, ప్రణయ్‌లకు శిక్షణ ఇచ్చిన సుధాకర్ రెడ్డి వద్ద శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తరఫున నెల్లూరులో శిక్షణ తీసుకున్నాడు.



రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ విజేత ట్రోఫీతో అజయ్‌కుమార్

- ఈ ఏడాది జనవరి 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రీజినల్ స్టేట్ మీట్‌లో పాల్గొన్న అజయ్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో సింగిల్స్ విభాగంలో విన్నర్‌గా నిలిచారు.
- 2019లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు.
- విజయనగరం, విజయవాడ, చిత్తూరు, హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాల్లో నిర్వహించిన పలు బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలను కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

నేడు శంకుస్థాపన కార్యక్రమాలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని అశోక్‌నగర్ నీటి శుద్ధి కేంద్రంలో రూ.4.62 కోట్లతో సూపర్‌వైజర్ కంట్రోల్ అండ్ డేటా అక్విజేషన్ నిర్వహణ కేంద్రం పనులకు సోమవారం ఉదయం 11 గంటలకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేస్తారని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 శుభ్రం చేసే యంత్ర వాహనాలను ప్రారంభిస్తారని, అలాగే రూ.22 కోట్లతో జగన్నాథగట్టు మీద ఐ.ఐ.టీ.డీ.ఎం కళాశాలకు తాగునీటి సరఫరాకు సంబంధించి వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరవుతారని పేర్కొన్నారు.

19న జిల్లా వ్యాప్తంగా నిరసనలు

కర్నూలు కల్చరల్: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 19న జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను తిరస్కరిస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిరసనలు తెలపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల నేతలందరూ పాల్గొనాలని కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెరగాలి



అనుగ్రహ భాషణం చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామి



పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెరగాల్సిన అవసరం ఉందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి అన్నారు. రాయలసీమ పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయన సూర్య నారాయణ స్వామి దేవాలయాన్ని దర్శించారు. ఆలయంలోని దేవీ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీచక్ర పూజ చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మాఘమాసం ప్రాముఖ్యత, సూర్యనమస్కారాలు, సూర్య అనుష్టానం గురించి భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు దివ్య దత్త రక్షలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఆలయ ట్రస్ట్ సభ్యులు, మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉరుకుందలో ఘనంగా గణపతి పూజ

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద గణపతి పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం సంకట చతుర్థి కావడంతో ఈ పూజలు చేపట్టారు. ఈనెల 3న మహా కుంభాభిషేకం జరగడం, మొదటి సారిగా ఆలయం వద్ద గణపతి విగ్రహ ప్రతిష్ఠ జరగడంతో హోమంతో పాటు పూజల్ని చేపట్టినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆలయ అర్చకులు హోమ కార్యక్రమాన్ని నిర్వహించగా దర్శనానికి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం భక్తులు విరివిగా విరాళాలు అందించి సహకారించాలని కోరారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



శ్రీకృష్ణ దేవరాయల జయంతిలో పాల్గొన్న నేతలు

కర్నూలు(అర్బన్): వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక చెరువులు, కాలువలు తవ్వించి దక్షిణ భారత దేశాన్ని సస్యశ్యామలం చేసిన శ్రీకృష్ణ దేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఫిబ్రవరి 16న అధికారికంగా నిర్వహించాలని నగర తెలగ, కాపు, బలిజ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ కోరారు. ఆదివారం శ్రీ కృష్ణ దేవరాయల 555వ జయంతి సందర్భంగా స్థానిక జీజీ హాస్పిటల్ సర్కిల్‌లో ఉన్న రాయల విగ్రహానికి కార్పొరేటర్లు రమణమ్మ, సాంబశివరావు గజమాల వేశారు. అనంతరం బలిజ సంఘం పెద్దలు ఆర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య, డాక్టర్ కుళ్లాయప్ప, భాస్కర్‌బాబు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక దేవాలయాలు నిర్మించి సాహితీ సమరాంగణ సార్వభౌములుగా శ్రీకృష్ణ దేవరాయలు పేరుగాంచారన్నారు. సంఘం గౌరవ సలహాదారు సోమశేఖర్ మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్యను మరింత పెంచాలన్నారు. కాపు భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, బలిజలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇటీవల పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది శ్రీనివాసులును సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. నాయకులు ఈశ్వర్‌కుమార్, శైలేష్, స్వామిరెడ్డి, రమణ, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కంకణబద్ధులు కావాలి

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణబద్ధులు కావాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం హరే రామ.. హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌మూర్తులు

కొత్త రేషన్‌కార్డుల మంజూరెప్పుడో?

- అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త కార్డుల ఊసేలేదు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు
- పేదలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

కల్లూరు: కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. రేషన్ కార్డు ల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అలాగే రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే కార్డులు

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులు వలంటీర్ల ద్వారా అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే రేషన్ కార్డులు అందించారు. అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వాలు బియ్యం, చక్కర, కంది బ్యాలు తదితర నిత్యావసర సరుకులు సరఫరా చేస్తుంటాయి. వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం దరఖాస్తుదారులకు విరివిగా రేషన్ కార్డులు అందజేసింది. గ్రామ/వార్డు సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులు ఇచ్చి చరిత్ర సృష్టించింది. అది కూడా వలంటీర్లు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరు అయ్యాక ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు రేషన్ కార్డులు అందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.



మళ్లీ 2014 మాదిరిగానే ఇస్తారా!

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో కార్డులు మంజూరయ్యేవి. దీంతో చాలా మంది అర్హులకు కార్డులు దక్కలేదు. ఈ కారణంగా కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. చాలా మంది ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసర సరుకులు అందక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే రేషన్ కార్డుల మంజూరులో కోతలు పడే అవకాశా లున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.



రేషన్ కార్డులు మంజూరు చేయాలి

మండలంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి. అలాగే రేషన్ కార్డులో కొత్త సభ్యులను చేర్పించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సేవలు, పథకాలు మొదలగు వాటన్నింటికి రేషన్ కార్డుల అవసరం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలు దక్కాలంటే తప్పనిసరిగా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి. **–మధు, సీఐటీయూ మండల కార్యదర్శి**

వైభవంగా కల్యాణోత్సవం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు మాంగళ్యధారణ చేశారు. వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందని వెల్లడించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటవ వార్డులో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఆ వార్డు కార్పొరేటర్ షాషావలీ అన్నారు. మన వార్డు – మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా వార్డు పరిధిలోని 3వ సచివాలయం చిదంబరరావు వీధి, సెంట్రల్ లైబ్రరీ వద్ద సీసీ రోడ్లు, కల్వర్టు, మురుగు కాల్వల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కార్పొరేషన్‌లో ఎన్నికలు లేకపోవడంతో వార్డుల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రావడంతో స్థానికంగా ప్రజల సమస్యలు పరిష్కారానికి అవకాశం ఏర్పడిందన్నారు. తన వంతు బాధ్యతగా వార్డులో పర్యటించినప్పుడు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.



చిదంబర వీధిలో సీసీ రోడ్లు, కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ షాషావలీ

పారా స్పోర్ట్స్‌లో 22 పతకాలు

కర్నూలు (టౌన్): ఈనెల 2వ తేదీన మంగళగిరిలో నిర్వహించిన పారా స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు 22 పతకాలు సాధించారు. బంగారు 11, వెండి 8 కాంస్యం 3 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లప్ప ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను కలిశారు. క్రీడాకారులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడు తూ.. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా స్పోర్ట్స్‌లో కర్నూలు నుంచి గౌతమ్, సాయి మర్నాద్, గణేష్, దినకర్, శివానీ ఎంపికైనట్లు వెల్లడించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం

కర్నూలు (టౌన్): వ్యక్తిగత నైపుణ్యానికి నిదర్శనం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు అని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒత్తిడి అధిగమించాలంటే క్రీడలు అవసరమన్నారు. మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. విపత్కర పరిస్థితును ధైర్యంగా ఎదుర్కొనవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రధానం చేశారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బెల్ట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

ఆహా ఏమి రుచి!



ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో అతిథులు, మానవత సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చారిటీ మహిళా ఫుడ్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగింది. ఏక్యాంప్‌లోని కుడా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, కుడా ఈఈ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవత సంస్థ మహిళా విభాగం సామాజిక సేవలు అభినందనీయన్నారు. మహిళా విభాగం కన్వీనర్ యాని ప్రతాప్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్, మహిళా ఎంటర్ ప్రెన్యుయర్స్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో వచ్చిన మొత్తాన్ని క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహణకు వినియోగిస్తామన్నారు. మహిళలు స్వచ్ఛందంగా తమ ఇళ్లలో వివిధ రకాల వంటకాలను తాయారు చేసుకొని వచ్చి ఫుడ్ ఫెస్టివల్ విక్రయించారు. రాగి ముద్ద, మటన్ బిర్యానీ, మిల్లెట్ ఫుడ్, పేనీలు, షిప్ ఫ్రై, మటన్ కట్‌లెట్, అవిసె, నువ్వుల లడ్డూలు, చాట్ ఐటమ్స్, మిల్క్ నన్నారి తదితర ఐటమ్స్‌తో ఫెస్టివల్ సందడి కనిపించింది. అధ్యక్షురాలు దీప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





ఫుడ్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్